క్లుప్తంగా

ప్రకృతి ప్రేమికుడికి అభినందన



మాట్లాడుతున్న ఎస్పీ రోహిత్‌రాజు

కొత్తగూడెంఅర్బన్: ప్రకృతి ప్రేమికుడు రాజశేఖర్ రోజూ ఒక మొక్కను నాటే కార్యక్రమంలో భాగంగా సోమవారం 1616వ మొక్కను జిల్లా ఎస్పీ రోహిత్‌రాజు చేత ఎస్పీ కార్యాలయం ఆవరణలో నాటించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. భారతదేశ ప్రధానమంత్రి నరేంద్ర మోదీచే 114వ మన్ కీ బాత్ కార్యక్రమంలో ప్రశంసలు, అభినందనలు అందుకున్న రాజశేఖర్ ప్రపంచ పర్యావరణ పరిరక్షణ కోసం విశేష కృషి చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో శ్రీనివాస్, లగడపాటి రమేశ్‌చంద్, దస్తగిరి, శ్యామ్, నాగరాజు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

జూలూరుపాడు: స్థానిక కేజీబీవీ జూనియర్ కళాశాలలో అతిథి ఉపాధ్యాయులుగా పనిచేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కేజీబీవీ ఎస్‌ఓ పద్మజ తెలిపారు. సోమవారం ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడారు. సీఆర్‌టీ ఇంగ్లిష్–1, పీజీ సీఆర్‌టీ జువాలజీ–1 పోస్టు ఖాళీగా ఉన్నాయని, సీఆర్‌టీ ఇంగ్లిష్ పోస్టుకు డిగ్రీ, బీఈడీ, పీజీ సీఆర్‌టీ జువాలజీ పోస్టుకు పీజీ, బీఈడీ ఉన్న మహిళా అభ్యర్థులు అర్హులన్నారు. ఆసక్తి గల వారు ఈ నెల 5వ తేదీ సాయంత్రం 4 గంటల వరకు తమ దరఖాస్తులను స్థానిక కేజీబీవీలో అందజేయాలని పేర్కొన్నారు.

నేడు మంత్రి పర్యటన

జూలూరుపాడు: రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచారశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మంగళవారం మండలంలో పర్యటించనున్నారు. మంత్రితో పాటు ఎమ్మెల్యే మాలోతు రాందాస్ మండలంలోని పలు ప్రాంతాల్లో బీటీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేయడమే కాక పూర్తయిన రహదారులను ప్రారంభిస్తారని కాంగ్రెస్ నాయకులు లేళ్ల వెంకటరెడ్డి, మాలోత్ మంగీలాల్‌నాయక్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంత్రి పర్యటనకు కాంగ్రెస్ శ్రేణులు తరలిరావాలని వారు కోరారు.

ఎందుకు సంబురాలు?

కొత్తగూడెంఅర్బన్: నమ్మి ఓట్లేసిన తెలంగాణ ప్రజలకు ఏం ఒరగబెట్టారని విజయోత్సవ సంబురాలు చేస్తున్నారని, సంబురాల పేరుతో ప్రజాధనం దుర్వినియోగం చేయడం తప్ప మరొకటి కాదని, కాంగ్రెస్ పాలనలో బస్సు తప్ప.. అంతా తుస్సేనని మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి సోమవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. ఇచ్చిన ఉచిత హామీలు గాలికి వదిలి తెలంగాణ ప్రజలను నిలువునా మోసం చేశారని, ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన ఏ ఒక్క హామీని కూడా ప్రభుత్వం నెరవేర్చలేదని విమర్శించారు.

పిల్లలకు పౌష్టికాహారం అందించాలి

జూలూరుపాడు: పిల్లలకు పౌష్టికాహారం అందించాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మాలోత్ మంగీలాల్‌నాయక్ అన్నారు. సోమవారం ఆయన పాపకొల్లు, భోజ్యాతండా గ్రామాల్లోని పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించారు. శిథిలావస్థలో ఉన్న భోజ్యాతండా(వెనకతండా) ప్రాథమిక పాఠశాల భవనాన్ని పరిశీలించి, సమస్యను ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. కార్యక్రమంలో బానోత్ నవీన్, వాంకుడోత్ కిషన్‌నాయక్, మోతీలాల్, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

చర్యలు తీసుకోవాలి

కొత్తగూడెంఅర్బన్: జీఓ నంబర్–76లో తప్పుడు ధ్రువపత్రాలతో ఇంటి పట్టాలకు దరఖాస్తు చేసుకున్న వారిపై చర్యలు తీసుకోవాలని బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎర్రా కామేశ్ అన్నారు. సోమవారం పార్టీ కార్యాలయంలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో ఇళ్లు ఉండి యాజమాన్య హక్కు లేని వారి కోసం ప్రవేశపెట్టిన జీఓ నంబర్–76 ద్వారా అక్రమ పద్ధతిలో పట్టాలు పొందిన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో గంధం మల్లికార్జున్‌రావు, సాయి, మాలోతు వీరునాయక్, వంగా రవిశంకర్, ఈసం మురళి తదితరులు పాల్గొన్నారు.

కౌన్సిల్ సభ్యులు పాల్గొనాలి

కొత్తగూడెంఅర్బన్: ప్రజాపాలన విజయోత్సవాల కార్యక్రమంలో భాగంగా అర్బన్ డే సందర్భంగా మంగళవారం పట్టణంలో జరుగనున్న కార్యక్రమాల్లో మున్సిపల్ కౌన్సిల్ సభ్యులందరూ పాల్గొని విజయవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్ శేషాంజన్‌స్వామి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలో ఉదయం అంబేడ్కర్ సెంటర్ నుంచి ఓల్డ్ డిపో వరకు 2కే రన్, మున్సిపల్ కార్యాలయంలో పారిశుద్ధ్య కార్మికులకు మెడికల్ క్యాంపు, పబ్లిక్ హెల్త్ వర్కర్లకు సన్మానం, మున్సిపల్ కార్యాలయం నుంచి అంబేడ్కర్ భవన్ వరకు ర్యాలీ, అంబేడ్కర్ భవన్‌లో సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని వివరించారు.

ఆంగ్లం అనర్గళంగా..

ఇంగ్లిష్ నేర్చుకునేందుకు ప్రత్యేక ల్యాబ్

- సింగరేణి మహిళా కళాశాలలో ఏర్పాటు
- రూ.13.55 లక్షలు వెచ్చించిన సింగరేణి యాజమాన్యం
- విద్యార్థినులకు ఉపాధి అవకాశాలు పెరిగేలా శిక్షణ



కళాశాలలో కంప్యూటర్ ల్యాబ్‌ను ప్రారంభించిన సింగరేణి సీఎండీ బలరామ్ (ఫైల్)

సింగరేణి(కొత్తగూడెం): మంచి కంపెనీల్లో ఉద్యోగాలు సాధించాలన్నా.. ఉన్నత విద్య కోసం విదేశాలకు వెళ్లాలన్నా ఇంగ్లిష్ భాషపై పట్టు తప్పనిసరి. అయితే, ప్రభుత్వ కళాశాలల్లో ఉన్న వనరులతో ఇంగ్లిష్ నేర్చుకోవడం విద్యార్థులకు కష్టమవుతోంది. ఈ నేపథ్యంలో ఆంగ్ల భాషా నైపుణ్యాలు పెంపొందించేందుకు కొత్తగూడెంలోని సింగరేణి మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో సింగరేణి యాజమాన్యం రూ.13.55 లక్షలతో మూడు నెలల కిందట ఇంగ్లిష్ ల్యాబ్ ఏర్పాటు చేసింది. దీంతో తాము భాషపై పట్టు సాధించేలా ఉపయోగపడుతుందని విద్యార్థినులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పోటీ ప్రపంచంలో సత్తా చాటేలా..

ప్రస్తుతం ఇంగ్లిష్‌కు ఉన్న ప్రాధాన్యత అంతా ఇంతా కాదు. అటు కంప్యూటర్‌పై పట్టు సాధించడంతో పాటు ఇటు ఇంగ్లిష్ మాట్లాడే నైపుణ్యం పెంపొందించుకునేలా సింగరేణి మహిళా కళాశాలలో ఏర్పాటు చేసిన ల్యాబ్ ఉపయోగపడుతోంది. సింగరేణి యాజమాన్యం ప్రత్యేక కోర్సు అమలుకు ఈ ల్యాబ్‌ను ఏర్పాటు చేయగా.. బెంగళూరుకు చెందిన ప్రముఖ సంస్థ సాఫ్ట్‌వేర్‌ను అందించింది. సుమారు 30 ఏళ్లుగా వేలాది మంది విద్యార్థులకు ఈ సాఫ్ట్‌వేర్ ద్వారా శిక్షణ అందగా ఇక్కడి విద్యార్థినులు సైతం ఆసక్తిగా నేర్చుకుంటున్నారు. డిజిటల్ లింగ్విస్టిక్ మెంటల్ (డీఎల్‌ఎం) ద్వారా పలు అంశాలను డౌన్‌లోడ్ చేసుకొని అధ్యాపకులు బోధిస్తున్నారు. అంతేకాకుండా వివిధ ప్రాంతాల నిపుణులు ఆన్‌లైన్‌లో ఇంటరాక్ట్ అవుతూ విద్యార్థులు సత్తా చాటేలా అవగాహన కల్పిస్తున్నారు. ఇంటర్ వరకు తెలుగు మీడియంలో చదివి డిగ్రీలో ఇంగ్లిష్ మీడియం తీసుకోవడంతో కొంత ఇబ్బంది పడినప్పటికీ ఈ ల్యాబ్ ఏర్పాటుతో తమకు ఇక్కట్లు తీరాయని చెబుతున్నారు. అటు ఉన్నత చదువులు, ఇటు ఉద్యోగావకాశాలు మెరుగయ్యేలా ఈ ల్యాబ్‌లో శిక్షణ అందుతోందనే భావన వ్యక్తం చేస్తున్నారు.

మా భవిష్యత్‌కు పునాది..



సింగరేణి యాజమాన్యం ఏర్పాటు చేసిన కంప్యూటర్ ల్యాబ్ ద్వారా ఇస్తున్న ఇంగ్లిష్ కోర్సు మాకు ఉపయోగపడుతుంది. ఇప్పటికే సబ్జెక్టుపై పట్టు రావడంతో పాటు మాట్లాడే నైపుణ్యాలు పెరుగుతున్నాయి. ఈ శిక్షణ మా భవిష్యత్‌కు పునాదిలా ఉపయోగపడుతుందని భావిస్తున్నాం.

–బి.దివ్య, బీఎస్సీ చివరి సంవత్సరం

అనేక అంశాలపై అవగాహన



ఈ కోర్సుతో చదవడం, ఇంటర్వ్యూలు ఎదుర్కోవడం సులభమవుతోంది. గ్రూప్ డిస్కషన్స్ (బృంద చర్చలు), ఉద్యోగ ఇంటర్వ్యూలు ఎదుర్కోవడం, ఆంగ్లంలో మాట్లాడటం ప్రస్తుతం తప్పనిసరిగా మారాయి. దీంతో ఈ శిక్షణ మాకు ఉపయోగపడుతుంది. యాజమాన్యం ఉపాధి కల్పిస్తే బాగుంటుంది.

–ఆయేశా, బీఎస్సీ చివరి సంవత్సరం

రోజుకు ఒక అంశంపై సన్నద్ధత



విద్యార్థినుల్లో ఆంగ్లంపై నైపుణ్యం పెంపొందించేలా ల్యాబ్ ద్వారా ప్రత్యేక శిక్షణ ఇస్తున్నాం. రోజూ ఒక అంశంపై బృంద చర్చలు పెట్టి, వారే ప్రశ్నలు వేసి, సమాధానాలు చెబుతూ పట్టు సాధిస్తున్నారు. ల్యాబ్ ప్రారంభించిన మూడు నెలల్లో విద్యార్థినుల్లో కొంత మేర మార్పు కనిపిస్తోంది.

–సీహెచ్.శారద, ప్రిన్సిపాల్, సింగరేణి ఉమెన్స్ కాలేజీ

తక్కువ ధరకు పత్తి కొనుగోళ్లు



వినతిపత్రం అందిస్తున్న నాయకులు

జూలూరుపాడు: స్థానిక తాత్కాలిక ఉప మార్కెట్ యార్డులో గిరిజనేతరులు సిండికేట్‌గా ఏర్పడి రైతుల నుంచి తక్కువ ధరకు పత్తి కొనుగోళ్లు చేస్తున్నారని ఎస్టీ సంఘాల ఐక్య వేదిక అనుబంధ రైతు సంఘాల నాయకులు సోమవారం ఏన్కూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి బజారును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా లకావత్ నాగేశ్వరరావు మాట్లాడుతూ.. గిరిజనేతరులు సిండికేట్‌గా ఏర్పడి రైతుల నుంచి పత్తిని తక్కువ ధరకు కొనుగోలు చేసి లాభాలు ఆర్జిస్తున్నారని ఆరోపించారు. దళారీ వ్యవస్థపై పెసా చట్టం ప్రకారం శాఖాపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఏన్కూర్ వ్యవసాయ మార్కెట్‌లో గిరిజనేతరులు లైసెన్స్ పొంది ఉంటే ఏజెన్సీ ప్రాంతంలో వర్తించదని, దీన్ని దృష్టిలో పెట్టుకొని లైసెన్స్‌లు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కుమార్, శ్రీను, మంగ్యా, శివ పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రం ప్రారంభం



కేంద్రాన్ని ప్రారంభిస్తున్న వీరహన్మంతరావు

సుజాతనగర్: ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని పీఏసీఎస్ చైర్మన్ మండె వీరహన్మంతరావు కోరారు. కాంగ్రెస్ నాయకులు నాగా సీతారాములు, కోనేరు సత్యనారాయణతో కలిసి వేపలగడ్డలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. సన్నరకం ధాన్యానికి బోనస్ ఇస్తూ ప్రభుత్వం రైతాంగానికి అండగా నిలిచిందని తెలిపారు. ఏఓ జి.నర్మద, నాయకులు దేవీప్రసన్న, చింతలపూడి రాజశేఖర్, పైడా రాజేంద్రప్రసాద్, బాగం మోహన్‌రావు, మడిపల్లి శ్రీనివాస్, కొప్పుల శ్రీనివాసరెడ్డి, చిమట నాగేశ్వరరావు, కిన్నెర వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాల ఆవిష్కరణ



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

జూలూరుపాడు: ఈ నెల 4, 5వ తేదీల్లో పాల్వంచలో భవన నిర్మాణ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో జరిగే రాష్ట్ర సైద్ధాంతిక శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని భవన నిర్మాణ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పోగులు కోటేశ్వరరావు పిలుపునిచ్చారు. సోమవారం ఆయన జూలూరుపాడులో నాయకులతో కలిసి కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. భవన నిర్మాణ కార్మికుల కోసం నూతన సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టడంలో, నిధులు పెంచడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. కార్యక్రమంలో భవన నిర్మాణ వర్కర్స్ యూనియన్ నాయకులు సిలివేరు నరసింహారావు, గుడిమెట్ల సీతయ్య, రామారావు, వెంకటేశ్వర్లు, రాంబాబు, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

అన్యాయంగా హత్య చేస్తున్నారు..



పట్టణంలో ప్రదర్శన నిర్వహిస్తున్న నాయకులు

కొత్తగూడెంఅర్బన్: సిద్ధాంతాల పేరుతో ఆదివాసీలను అన్యాయంగా మావోయిస్టులు హత్య చేస్తున్నారని ప్రజా సంఘాల నాయకులు ఆరోపించారు. సోమవారం హత్యలపై నిరసన వ్యక్తం చేస్తూ ప్రజా సంఘాల నాయకులు ప్లకార్డులతో పట్టణంలో ర్యాలీ నిర్వహించి బస్టాండ్ సెంటర్‌లో మానవహారం నిర్వహించారు. ఏజెన్సీ ప్రాంతాల్లో జరుగుతున్న అభివృద్ధికి ఆటంకంగా మారుతూ, అక్కడ ప్రజలకు తీవ్ర అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. వారి ఉనికిని కాపాడుకోవడం కోసం హత్యలు చేస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో సాగర్, నాగరాజు, హేమంత్, అస్లాం, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

శ్మశానవాటికలో పారిశుద్ధ్య పనులు

ఇల్లెందు: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడిచిన సందర్భంగా ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా సోమవారం పట్టణంలోని హిందూ శ్మశానవాటికలో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టారు. పనులను మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, కమిషనర్ శ్రీకాంత్, మేనేజర్ అంకుషావలి, కౌన్సిలర్ తోట లలితశారద, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శంకర్, జవాన్లు పర్యవేక్షించారు.

ఏడాదిలోనే అభివృద్ధి చూపించారు..

కొత్తగూడెంఅర్బన్: ఏడాది కాలంలోనే అభివృద్ధి చేసి చూపించారని వార్డు కౌన్సిలర్ తంగెళ్ల లక్ష్మణ్ తెలిపారు. ప్రజాపాలన విజయోత్సవ సంబరాల సందర్భంగా సోమవారం 29వ వార్డులో మహిళలు ముగ్గులు వేసి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శేషాంజన్‌స్వామి, ఆర్పీలు గౌసియా, లక్ష్మి, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ అశోక్‌చౌహాన్, వీరభద్రాచారి, జవాన్ సలీం, ప్రజలు పాల్గొన్నారు.

లేబర్ బోర్డు కార్డులు పొందండి

ఇల్లెందు: బిల్డింగ్ వర్కర్లు తక్షణమే లేబర్ బోర్డు అందజేసే కార్డులను పొందాలని, కార్డులు కలిగిన వారు రెన్యూవల్ చేసుకోవాలని సీఐటీయూ నాయకులు సూచించారు. సోమవారం అడ్డాల వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులకు అవగాహన సదస్సులు నిర్వహించారు. నబీ, కృష్ణ మాట్లాడుతూ.. ప్రభుత్వం నుంచి పలు రకాల ప్రయోజనాలు ఉన్నాయని వాటిని పొందాలంటే అనేక నియమాలు ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో కామనాగరాజు, సత్యనారాయణ, సొమ్మ, శ్రీనివాస్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

సీహెచ్‌పీ ఇన్‌చార్జ్‌కు సత్కారం



క్రిస్టోఫర్‌ను సత్కరిస్తున్న ఉద్యోగులు

ఇల్లెందు: సింగరేణి ఇల్లెందు ఏరియా సీహెచ్‌పీ ఇన్‌చార్జ్ డీజీఎం(ఈఅండ్‌ఎం) క్రిస్టోఫర్‌ను అక్కడి ఉద్యోగులు ఘనంగా సత్కరించారు. సోమవారం జరిగిన కార్యక్రమంలో సీహెచ్‌పీలో ఇన్‌చార్జ్‌గా పనిచేస్తూ డీజీఎంగా పదోన్నతి పొందిన ఆయన్ను సత్కరించారు. కార్యక్రమంలో నజీర్ అహ్మద్, నూనె శ్రీను, యాకూబ్, మనీ రవీంద్ర, వీరస్వామి, దాట్ల శ్రీకాంత్, మోసిన్, ముకేశ్, కిశోర్, సమ్మయ్య, శ్వేత, కొండపల్లి శ్రీనివాస్, హరీశ్ పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీల్లో ప్రతిభ



గెలుపొందిన విద్యార్థులతో డీఈఓ, తదితరులు

కొత్తగూడెంఅర్బన్/జూలూరుపాడు: ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా సోమవారం కొత్తగూడెంలోని జిల్లా విద్యా శిక్షణ కేంద్రంలో జిల్లాస్థాయి వ్యాసరచన పోటీలు నిర్వహించగా పలువురు విద్యార్థులు ప్రతిభ చూపారు. ప్రథమ బహుమతి పాత పాల్వంచ జెడ్పీహెచ్‌ఎస్‌కు చెందిన ఎ.సురేంద్ర, ద్వితీయ బహుమతిని జూలూరుపాడు జెడ్పీహెచ్‌ఎస్‌కు చెందిన హరేంద్రనాథవార్దేయ, తృతీయ బహుమతిని పాల్వంచ జెడ్పీహెచ్‌ఎస్ (బాలికలు)కు చెందిన ఎస్‌కే సోఫియా గెలుచుకున్నారు. మరో ముగ్గురికి కన్సోలేషన్ బహుమతులు అందించారు. మొదటి మూడు బహుమతులు పొందిన విద్యార్థులు 3వ తేదీన హైదరాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి వ్యాసరచన పోటీల్లో పాల్గొంటారని డీఈఓ వెంకటేశ్వరచారి తెలిపారు. కార్యక్రమంలో ఎ.నాగరాజశేఖర్, 90 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

కొత్త మండలాలు ఏర్పాటు చేయండి



అబ్బయ్య కుటుంబ సభ్యులతో మంత్రి పొంగులేటి

ఇల్లెందు: ఇల్లెందు నియోజకవర్గంలో కొత్తగా రెండు మండలాలు ఏర్పాటు చేయించడంతో పాటు ఇల్లెందు కేంద్రంగా రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయాలని న్యూడెమోక్రసీ నాయకులు కోరారు. సోమవారం టేకులపల్లి మండల పర్యటనకు వచ్చిన రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి న్యూడెమోక్రసీ నాయకులు ఆవునూరు మధు, కె.సారంగపాణి, కోలా లక్ష్మీనారాయణ వినతిపత్రం అందజేశారు. ఎన్నికల ముందు కొమరారం, బోడు మండలాలు ఏర్పాటు చేస్తామని, ఇల్లెందు కేంద్రంగా డివిజన్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. దీంతో మంత్రి సానుకూలంగా స్పందించి పూర్తి వివరాలు సమర్పించాలని సూచించారని మధు తెలిపారు. కాగా, ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన మాజీ ఎమ్మెల్యే ఊకే అబ్బయ్య కుటుంబాన్ని రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మండలంలోని హనుమంతులపాడులో పరామర్శించారు. అబ్బయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే కోరం కనకయ్య, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ఏడు శాతం రిజర్వేషన్ కల్పించాలి



మాట్లాడుతున్న ఉల్లెంగుల యాదగిరి

చుంచుపల్లి: గ్రామస్థాయి నుంచి పార్లమెంట్ వరకు రజకులకు 7 శాతం రిజర్వేషన్ కల్పించాలని రజక సంఘం ఆల్ ఇండియా ఉపాధ్యక్షులు ఉల్లెంగుల యాదగిరి అన్నారు. సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఇంద్రాల దుర్గయ్య, సుంకరి అజిత్‌కుమార్ నేతృత్వంలో సోమవారం కొత్తగూడెంలో నిర్వహించిన సమావేశానికి ఆయన హాజరై ప్రసంగించారు. మున్సిపాలిటీ, కార్పొరేషన్, శాసనమండలి, అసెంబ్లీ, పార్లమెంట్, రాజ్యసభ, దేవస్థాన కమిటీలు, మార్కెట్ కమిటీలు, స్టేట్ కార్పొరేషన్లలో రజకులకు తగిన ప్రాధాన్యత ఇస్తూ రిజర్వేషన్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి నేరెళ్ల రమేశ్, యూత్ సెక్రెటరీ ఇంద్రాల మురళి, యూత్ ఆర్గనైజర్ సతీశ్, టౌన్ ప్రెసిడెంట్ అజాజ్, భిక్షపతి, గణేశ్, కనకరాజు, సత్యం, శంకర్, దశరథ్, గూడెపు రమేశ్, పోశం, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

జీఎంకు బీఆర్‌ఎస్ నేతల సత్కారం



జీఎం కృష్ణయ్యను సన్మానిస్తున్న నాయకులు

ఇల్లెందు/టేకులపల్లి: సింగరేణి ఇల్లెందు ఏరియా జీఎంగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన వీసం కృష్ణయ్యను టీబీజీకేఎస్, బీఆర్‌ఎస్ నాయకులు సోమవారం కలిసి సన్మానించారు. సింగరేణి పురిటిగడ్డ ఇల్లెందు ఏరియా పరిరక్షణకు కృషి చేయాలని బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు దిండిగాల రాజేందర్ జీఎం కృష్ణయ్యను కోరారు. కార్యక్రమంలో జాఫర్ హుస్సేన్, ఎస్.రంగనాథ్, లక్కినేని సురేందర్‌రావు, చెరుపల్లి శ్రీనివాస్, సిలివేరు సత్యనారాయణ, జబ్బార్, నబీ, వసంతరావు, బొమ్మెర వరప్రసాద్, మాలోతు సురేందర్‌నాయక్, తోలెం మల్లయ్య, వెంకటేశ్వరరావు, బానోత్ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

తడిసిన ధాన్యాన్నీ కొనాల్సిందే..



తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న నాయకులు

పాల్వంచరూరల్: తుపాన్ కారణంగా ఆదివారం సాయంత్రం కురిసిన వర్షానికి కళ్లంలో ఆరబోసిన ధాన్యం తడిసిందని, ఈ ధాన్యాన్ని కూడా కొనుగోలు చేయాలని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా నాయకులు నిమ్మల రాంబాబు డిమాండ్ చేశారు. సోమవారం తడిసిన ధాన్యాన్ని ఆయన పరిశీలించారు. చిన్న, సన్న కారు రైతులు ఆరుగాలం కష్టపడి అధిక పెట్టుబడులు పెట్టి పండించాక చేతికి వచ్చిన సమయంలో ప్రకృతి విపత్తుల కారణంగా నష్టం వాటిల్లుతోందని, తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వ మద్దతు ధరకు వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కంటే గోవర్ధన్, నెల్లెల రమణయ్య, విశ్వనాథం, కంటే ఖాజా, తమ్మయ్య, వీరేశ్, వీరకృష్ణ, నాగరాజు, నర్సయ్య, శ్రీను, సూరిబాబు, సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతులు



వినతిపత్రం ఇస్తున్న పీవైఎల్ నాయకులు

ఇల్లెందురూరల్: గ్రామాల్లో విచ్చలవిడిగా ఏర్పాటైన బెల్టుషాపులను నియంత్రించాలని కోరుతూ పీవైఎల్ ఆధ్వర్యంలో సోమవారం ఇల్లెందు ఎక్సైజ్ అధికారులకు వినతిపత్రం అందజేశారు. నాయకులు పర్సిక రవి, చింత రాంచంద్రయ్య మాట్లాడారు. రాష్ట్రంలో డ్రగ్స్, గంజాయితోపాటు మద్యం ఏరులై పారుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. యువత మత్తుకు బానిసలై బంగారు భవిష్యత్‌ను ఆగం చేసుకుంటున్నారని, ఫలితంగా కుటుంబాలు ఆర్థికంగా చితికిపోతుండగా.. యువతులు చిరుప్రాయంలోనే వితంతువులుగా మారుతున్నారని వాపోయారు. కార్యక్రమంలో పీవైఎల్ నాయకులు శేఖర్, లాజర్, జోగా కృష్ణ, తారాచంద్, మాలు, ఇర్ప విజయ్, మడకం సురేశ్, నాగేశ్వరరావు, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ ఇన్సెంటివ్ చెల్లించాలని..

పనికి తగిన పారితోషికం, పెండింగ్‌లో ఉన్న ఇన్సెంటివ్ చెల్లించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో ఆశ కార్యకర్తలు సోమవారం రొంపేడు పీహెచ్‌సీ వైద్యాధికారిణి కవితకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రెండు దఫాలుగా లెప్రసీ సర్వేకు సంబంధించిన పారితోషికం ఇవ్వకుండా తాజాగా మరోసారి సర్వే చేయాలని తమను ఆదేశించడం సరికాదని స్పష్టం చేశారు. తమకు కనీస వేతనం అమలు చేయకుండా ప్రభుత్వ సంబంధిత సర్వేల్లో వాడుకుంటున్నారని వాపోయారు. కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు మల్లీశ్వరి, విజయలక్ష్మి, శ్రీలక్ష్మి, సరిత, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతులు కల్పించాలని..

సూపర్‌బజార్(కొత్తగూడెం): పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్న కొత్తగూడెం నియోజకవర్గంలో ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేయాలని కోరుతూ జిల్లా అదనపు కలెక్టర్ వేణుగోపాల్‌కు సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ కొత్తగూడెం డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం వినతిపత్రం అందజేశారు. ప్రధానంగా ప్రజలకు అవసరమైన ఇళ్ల నిర్మాణం, తాగునీటి సౌకర్యం, మరుగుదొడ్లు, రహదారులు నిర్మించడంలో ప్రభుత్వం విఫలమైందని పేర్కొన్నారు. ప్రధాన రహదారుల వెంట ప్రయాణికుల సౌకర్యార్థం బస్ షెల్టర్ నిర్మించడంలో కూడా విఫలం చెందారన్నారు. ఇంకా పలు సమస్యలు వివరించి పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ నాయకులు ఏదులాపురం గోపాల్‌రావు, బానోత్ ధర్మ, కల్లూరి కిశోర్, పెద్దబోయిన సతీశ్, రాజశేఖర్, చంద్రశేఖర్, నాగయ్య తదితరులు పాల్గొన్నారు.